


'బీజామృతం'తో విత్తనశుద్ధి

సేంద్రియ వ్యవసాయం గురించి శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. 8లో



నామినేషన్ల పరిశీలన పూర్తి

విశాఖ: జీవీఎంసీ స్థాయీ సంఘ ఎన్నికలో వైఎస్సార్ సీపీ, టీడీపీల నుంచి పదేసిమంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి.

వైద్యం కోసం వెళ్లి..



నక్కపల్లి మండలంలో ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ఏడుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు ఆనందపురం మండలం వేములవలస గ్రామానికి చెందినవారు. 8లో

న్యూస్‌రీల్

రేపు అడ్డురోడ్డులో మెగా జాబ్‌మేళా

అనకాపల్లి టౌన్: ఉద్యోగ కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ప్రకటనలో పేర్కొన్నారు. పాయకరావుపేట నియోజక వర్గం అడ్డురోడ్డులోని ఎస్వీఎస్ డిగ్రీ కళాశాలలో ఈనెల 14వ తేదీన 15 కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

నర్సీపట్నం: జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో రెండో విడత ప్రవేశాలకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆగస్టు 1వ తేదీలోగా చేసుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికేట్లతో దగ్గరలోని ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఆగస్టు 3వ తేదీన జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని, ఏ ఐటీఐకు దరఖాస్తు చేసుకుంటే కౌన్సెలింగ్‌కు అక్కడికే వెళ్లాలన్నారు. పూర్తి వివరాలకు నర్సీపట్నం ట్రైనింగ్ ఆఫీసర్ టి.చక్రపాణిని 9491813637 నంబరు ఫోన్లో, పాయకరావుపేట అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ డి.చంద్రశేఖర్‌ను 7013737243 నంబరు ఫోన్లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

తుమ్మపాల: ఎన్టీపీసీ, సీఐపీఈటీ(విజయవాడ) సౌజన్యంతో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఐపీఈటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పరవాడ మండలం ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల్లో స్థానికత కలిగి 10వ తరగతి విద్యార్హతతో 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగ యువత మాత్రమే అర్హులన్నారు. వీరికి పాలిమర్స్ టెక్నాలజీలో 6 నెలల పాటు విజయవాడలో శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్ అందిస్తామన్నారు. విశాఖపట్నం, అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూర్, చెన్నై ప్రాంతాల్లో ప్రముఖ ప్లాస్టిక్స్, అనుబంధ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత సీఐపీఈటీ ప్రతినిధి బాణాపతు అంజినాయక్(7893586494)ను సంప్రదించి ఈ నెల 17లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

పాలిటెక్నిక్ లెక్చరర్లకు శిక్షణ ప్రారంభం

రాంబిల్లి: పూడి వద్ద గల ఎంఎస్ఎంఈలో గవర్నమెంట్ పాలిటెక్నిక్ లెక్చరర్లకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. స్ట్రెస్ ఎనాలసిస్ ఇంజినీర్ సీహెచ్ దుర్గారావు, ప్రొఫెసర్ సీవీ గోపినాథ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. 18 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఎంఎస్ఎంఈ ఇన్‌చార్జ్ డాక్టర్ విజయ్ కృష్ణకాంత్, ఎంఎస్ఎంఈ మేనేజర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సెజ్ కార్మికులకు ఆరోగ్య భరోసా

ఏపీలో అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతంగా అచ్యుతాపురం–పరవాడ సెజ్ అభివృద్ధి చెందుతోంది. వందలాది పరిశ్రమలు.. వేలాది ఉద్యోగాలతో స్థానిక యువతకు ఉపాధి నెలవు ఈ పారిశ్రామిక వాడ. అయితే ఇక్కడి కార్మికులు అనారోగ్యానికి గురైతే విశాఖకు వెళ్లాల్సిందే. సమీపంలో ఈఎస్ఐ ఆస్పత్రి లేదు. ఆ స్థాయిలో వైద్య సేవలందించే ఆస్పత్రులూ లేవు. కొత్తగా ఇక్కడ ఏర్పాటు చేయనున్న 30 పడకల ఈఎస్ఐ ఆస్పత్రితో ఆ దుస్థితికి తెరపడనుంది.

- 30 పడకల ఈఎస్ఐ ఆస్పత్రికి రూ.50 కోట్లు మంజూరు
- రెండెకరాల ఏపీఐఐసీ స్థలాన్ని కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- అచ్యుతాపురం–పరవాడ సెజ్‌లో 60 వేల మంది కార్మికులకు లబ్ధి

సాక్షి, అనకాపల్లి: జిల్లాలోని అచ్యుతాపురం సెజ్ ఉద్యోగులకు ఏళ్లనాటి కల నెరవేరబోతోంది. ఈఎస్ఐ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఉన్న డిస్పెన్సరీ స్థానంలో 30 పడకల ఆస్పత్రి నిర్మించాలని ఈఎస్ఐ నిర్ణయించింది. రాష్ట్రంలో మొత్తం 50 లక్షల మందికి పైగా ఈఎస్ఐ పథకం ప్రయోజనాలు పొందుతుండగా అందులో ఒక్క అచ్యుతాపురం సెజ్ పరిధిలోనే సుమారు 60 వేల మంది ఉద్యోగులున్నారు. వీరికి ఇమేషెంట్ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు కేంద్రం రూ.50 కోట్ల నిధులను మంజూరు చేసింది. భవిష్యత్తులో దశలవారీగా దీన్ని 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర కార్మిక శాఖ భరోసా కల్పించింది.

రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా స్థల కేటాయింపు

ఏ రాష్ట్రంలోనైనా ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేస్తే, ఆస్పత్రికి అవసరమైన భూమి కొనుగోలుకు ధరలో నాలుగో వంతు కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఇదే రీతిన 2020లో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం అచ్యుతాపురం సెజ్‌లో రెండెకరాలను కేటాయించింది. అది అనుకూలంగా లేదనడంతో.. తాజాగా అచ్యుతాపురం బ్రాండెక్స్ సమీపంలో భూమిని కేటాయిస్తూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మాణ బాధ్యతలను సీపీడబ్ల్యూడీ శాఖకు అప్పగించారు. ప్రస్తుతం టెండర్ దశలో ఉంది. స్థలం కోసం ఏపీఐఐసీకి నాల్గో వంతు ధర చెల్లించలేమని కేంద్రం చెప్పింది. దీంతో అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఉచితంగానే స్థలాన్ని కేటాయించాల్సిందిగా ఏపీఐఐసీకి సీఎం ఆదేశించారు. దీంతో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి స్థలాన్ని ఏపీఐఐసీ ఉచితంగానే కేటాయించింది.

ఆస్పత్రి, స్టాఫ్ క్వార్టర్స్‌కు డిజైన్లు సిద్ధం

జీ+3 తరహాలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం చేపట్టనున్నారు. 2,157 చదరపు మీటర్ల విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్, 2,119 చ.మీ.లో మొదటి అంతస్తు, 1,939 చ.మీ.లో రెండో అంతస్తు, 1,613 చ.మీ. విస్తీర్ణంలో మూడో అంతస్తు నిర్మాణం చేపట్టనున్నారు. ఆస్పత్రి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.34 లక్షల 50 వేల 440లు కేటాయించారు. ఈఎస్ఐ ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికీ, వైద్యులకు 16 క్వార్టర్స్ నిర్మాణానికి ప్లాన్ కూడా సిద్ధం చేశారు. వీటిలో టైప్–2 క్వార్టర్స్ 8, టైప్–3 క్వార్టర్స్ 4, టైప్–4 క్వార్టర్స్ 2, టైప్–4 స్పెషల్ క్వార్టర్స్ 2 ఏర్పాటుకు ప్లాన్ సిద్ధం చేశారు. వీటికి కూడా కేంద్ర కార్మిక శాఖ నిధులు కేటాయించనుంది.



ఆస్పత్రి డిజైన్



ఈఎస్ఐ ఆస్పత్రికి ఏపీఐఐసీ కేటాయించిన స్థలం

వైజాగ్ వెళ్లనక్కర్లేదు!



సెజ్‌లోని ఎక్సెల్ ఫార్మా కంపెనీలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నా. సెజ్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉంది. మాతో పాటు మా కుటుంబ సభ్యులూ చిన్నపాటి వైద్యానికీ వైజాగ్ వెళ్లాల్సి వచ్చేది. లేదంటే.. ఇక్కడే ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి. దీంతో మాకు వచ్చిన జీతంలో సగం వాటికే సరిపోతుంది. సెజ్‌లో ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే సకాలంలో మెరుగైన వైద్యం పొందవచ్చు.

– కాళ్ల ఆదిత్య భాస్కర్, దిబ్బపాలెం సెజ్‌కాలనీ

ప్రభుత్వాలకు ధన్యవాదాలు



మూడేళ్లుగా సెజ్‌లో ల్యాబ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాను. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడ్డాం. మాకు రోస్టర్ విధానంలో షిఫ్టులు ఉంటాయి. స్లీపింగ్ సైకిల్ సరిగాలేక సీజనల్ వ్యాధులకు గురవుతూ ఉంటాం. ఈఎస్ఐలో అయితే ఉచిత వైద్యం అందిస్తారు. ఎవరికి ఏ చిన్న అనారోగ్యం వచ్చినా వైజాగ్ వెళ్లాల్సిందే. ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు నిర్ణయం హర్షణీయం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు.

– ఎస్.పేరయ్య, ఎక్సెల్ ఫార్మా కంపెనీ

వైఎస్సార్‌సీపీ ఎంపీల కృషి



ఏపీలో కొత్తగా 8 ఈఎస్ఐ ఆస్పత్రులు, 18 డిస్పెన్సరీల ఏర్పాటుకు ఈఎస్ఐ కార్పొరేషన్ గతేడాది డిసెంబర్ 12న ఆమోదం తెలిపింది. నిధులు కూడా మంజూరు చేసింది. ఆస్పత్రితోపాటు, సిబ్బంది క్వార్టర్స్, ఇతర మౌలిక వసతులకు అదనంగా నిధులిస్తామని కేంద్ర కార్మిక శాఖ మంత్రి భూపేంద్రయాదవ్ హామీ ఇచ్చారు. సెజ్‌లో వేలాది మంది మహిళా ఉద్యోగులున్నారు. వారి ఆరోగ్య రీత్యా ఈఎస్ఐ ఆస్పత్రి కోసం వైఎస్సార్‌సీపీ ఎంపీలు అందరం కలిసి కేంద్రాన్ని కోరాం. ఒక వైద్యురాలిగా నేను అభ్యర్థించిన ప్రతి అంశాన్నీ కేంద్రం పరిగణనలోకి తీసుకుంది. శంకుస్థాపనకు వచ్చేందుకు కేంద్ర మంత్రి సుముఖత తెలిపారు.

– భీశెట్టి వెంకట సత్యవతి, అనకాపల్లి ఎంపీ

కరోనాలో ప్రాణాలకు తెగించి..

కోవిడ్ మహమ్మారి విలయ తాండవం చేసిన సమయంలో మనుషుల మధ్య దూరం పెరిగింది. కుటుంబ సభ్యులే అక్కరకు రాని దుర్భర కాలమది. అలాంటి సమయంలో గ్రామ వలంటీర్లు ప్రాణాలకు తెగించి చక్కని సేవలందించారు. చినరామభద్రపురం వలంటీర్ సఖిరెడ్డి నాగేంద్ర తన పరిధిలోని 50 కుటుంబాల వారికి తలలో నాలుకలా వ్యవహరించారు. అంగన్‌వాడీ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన పోషకాహార సరకులు, చక్కీలు, కోడిగుడ్లు ఇళ్లకు తీసుకెళ్లి అందించేవారు. ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, ఎవరికైనా ఆరోగ్యం బాగులేకపోతే వెంటనే సమీప ఏఎన్ఎం దృష్టికి తీసుకెళ్లేవారు. గ్రామంలో హైపోక్లోరైట్ ద్రావణం పిచికారీ చేసేవారు.

–నక్కపల్లి



మహిళకు పోషకాహారం అందజేస్తున్న వలంటీర్ నాగేంద్ర

కన్న కూతురిలా సేవలు..

ఈ చిత్రంలో ఉన్న వృద్ధురాలి పేరు అచ్చియ్యమ్మ. అనకాపల్లిలో మల్లిమణుగులవారివీధిలో ఉంటారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో తనకు ఆరోగ్యం బాగులేకపోతే నేనున్నానంటూ వలంటీర్ కుమారి తనకు ధైర్యం అందించిందని, కన్న కూతురిలా ఆదుకుందని చెప్పారామె. నిత్యావసర సరుకుల నుంచి మందుల వరకు ఇంటికే తీసుకు వచ్చి అందించారని తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు సంబంధించిన సమాచారం తెలిపి, ఇంటి వద్దనే దరఖాస్తు తీసుకుంటుందని, తమకు పథకం వర్తించే వరకు ఫాలో అప్ చేస్తుందని తెలిపారు. ప్రతి నెలా ఠంచనుగా ఒకటో తేదీన వృద్ధాప్య పింఛన్ అందిస్తుందని, ఒకసారి తనకు బాగులేక ఆస్పత్రిలో చేరితే అక్కడికే వచ్చి మరీ పింఛన్ అందించిందని తెలిపారు. –అనకాపల్లి టౌన్



అచ్చియ్యమ్మకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ కుమారి

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ కోచ్‌గా పోలిరెడ్డి



యలమంచిలి: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు కోచ్‌గా యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వై.పోలిరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు కేఐఐటీ డీమ్డ్ యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ జనరల్ నుంచి ఉత్తర్వులు అందినట్లు పోలిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారులకు శిక్షకుడిగా తనను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి ఆగస్టు 8 వరకు చైనాలోని చెంగ్డూ నగరంలో ప్రపంచ దేశాలకు చెందిన వివిధ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ జట్లు ఈ పోటీలలో పాల్గొంటాయని, భారతదేశం బ్యాడ్మింటన్ కోచ్‌గా తనను ఎంపిక చేయడం పట్ల సంతోషంగా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్, తోటి ఆధ్యాపక బృందం, పలువురు క్రీడాకారులు ఆయనను అభినందించారు.

హైస్కూల్లో రెండు గంటలు

- కొత్త ఎల్లవరంలో విద్యార్థులతో కలెక్టర్ మాటామంతీ
- గొలుగొండ మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన



విద్యార్థుల విద్యా నైపుణ్యం గురించి ఆరా తీస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

గొలుగొండ: కొత్త ఎల్లవరంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి బుధవారం రెండు గంటల సమయం గడిపారు. మండల పర్యటనకు వచ్చిన ఆయన ఉన్నత పాఠశాలలో ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించారు. తొలుత ఇక్కడ రూ.50 లక్షలతో జరుగుతున్న నాడు–నేడు పనుల పురోగతిని స్వయంగా చూసి తెలుసుకున్నారు. 3వ తరగతి నుంచి 10 వతరగతి వరకు ప్రతి క్లాస్ రూమ్‌కు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. వారికి పలు ప్రశ్నలు వేసి విద్యా నైపుణ్యాన్ని పరిశీలించారు. ముఖ్యంగా లెక్కల్లో వారి పరిజ్ఞానాన్ని పరీక్షించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం గ్రామంలో నిర్మాణం జరుగుతున్న రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్ పనులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. కలెక్టర్ పర్యటనలో నర్సీపట్నం ఆర్డీవో జయరాం, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ, ఎంఈవో సత్యనారాయణ, గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి, తహసీల్దార్ ఆనందరావు, జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

కొత్త ఎల్లవరంలో అధికారులతో కలెక్టర్ సమీక్ష జరిపారు. గ్రామ సచివాలయం సిబ్బంది కూడా సమావేశంలో పాల్గొన్నారు. కొత్త ఎల్లవరం, కసిమి పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి, వాటి వివరాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తాగునీటిని సమస్యలు, వ్యాధులు లేకుండా ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలని తెలిపారు.

'సురక్ష'కు స్పందన సూపర్

- దరఖాస్తు చేసినవారు 1.80 లక్షలమంది
- ధ్రువపత్రాలు అందుకున్నవారు 1.60 లక్షలమంది
- మాకవరపాలెం, నక్కపల్లి మండలాలకు మొదటి, రెండు స్థానాలు



ఇటీవల కొరుప్రోలులో జగనన్న సురక్షలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి (ఫైల్)

నక్కపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమం ప్రారంభమైన తొలి 12 రోజుల్లోనే దరఖాస్తు చేసిన వారిలో 95 శాతం మందికి ధ్రువపత్రాల పంపిణీ పూర్తి చేశారు. గతంలో ఏదైనా ధ్రువపత్రం కావాలంటే దరఖాస్తుదారులు ఈసేవా కేంద్రాలు, సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. లింక్ డాక్యుమెంట్లు సమర్పించి వేలాది రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ధ్రువపత్రం చేతికి వచ్చేటప్పటికి 15 రోజులు పట్టేది. వలంటీర్లే తమ దగ్గర దరఖాస్తులు స్వీకరించి, కావలసిన సర్టిఫికెట్లను వెంటనే అందిస్తున్నారంటూ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎటువంటి యూజర్ చార్జీలు వసూలు చేయకుండా లబ్ధిదారులకు అవసరమైన ధ్రువపత్రాలను సచివాలయంలో నిర్వహించే గ్రామ సభల్లో అందించే ప్రక్రియను జగనన్న ప్రభుత్వం చేపట్టడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్, జేసీ, డీపీవో, జెడ్పీ సీఈవో, తదితర జిల్లా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడంతో విజయవంతమయింది.

జిల్లాలో మొదటి స్థానం మాకవరపాలెం మండలం (94.9 శాతం)

దరఖాస్తులు	పరిష్కారం
9659	9164

రెండో స్థానం నక్కపల్లి మండలం (94.3 శాతం)

దరఖాస్తులు	పరిష్కారం
9673	9123

ఇలా సాధించారు..

జగనన్న సురక్ష కార్యక్రమం 522 సచివాలయాల్లో ఈనెల 1వ తేదీన ప్రారంభమైంది. సురక్ష గ్రామసభలకు పది రోజుల ముందు నుంచే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులు క్లస్టర్ల వారీగా ఇంటింట సర్వే నిర్వహించారు. 9557 క్లస్టర్లకు గాను 5508 క్లస్టర్లలో ఈ సర్వే జరిగింది. సర్వేలో గుర్తించిన అవసరాలను వలంటీర్ల వద్ద ఉన్న మొబైల్‌యాప్‌లో మొత్తం 1,80,250 దరఖాస్తులు అప్‌లోడ్ చేశారు. వాటిపై విచారణ నిర్వహించారు. ఎటువంటి అభ్యంతరాలు లేనివి, వివాదాస్పదం కాని వాటిని ఎంపిక చేసి వాటికి టోకెన్ నెంబరు జారీ చేశారు. టోకెన్లు జారీ చేసిన దరఖాస్తులకు అవసరమైన ధ్రువపత్రాలను క్లస్టర్లవారీగా సిద్ధం చేసి గ్రామసభల్లో వాటి పంపిణీని ప్రారంభించారు. తొలి 12 రోజుల్లో 1,60,316 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

సురక్ష కార్యక్రమంలో అందుతున్న 11 రకాల సర్వీసులు

కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు–జనన–మరణ–మ్యుటేషన్–వివాహ రిజిస్ట్రేషన్ – వారసత్వ – పట్టాదారు పాసుపుస్తకం – ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం– రైసు కార్డు–కౌలు రైతుల గుర్తింపు కార్డు–రేషన్ కార్డు నుంచి వివాహం అయిన సంతానాన్ని వేరు చేయడం

మూడు రోజుల్లో మ్యారేజి సర్టిఫికెట్



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నాకు కేవలం మూడు రోజుల వ్యవధిలో వివాహ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాన్ని అందజేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి సంప్రదిస్తే కనీసం పది రోజులు పడుతుందని చెప్పారు. ఇంతలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం కావడంతో మా ఇంటికి వచ్చిన వలంటీరుకు ఈ విషయం చెప్పి అవసరమైన పత్రాలన్నీ ఇచ్చాను. వారు పరిశీలించి మూడు రోజుల్లో మా సచివాలయంలో జరిగిన గ్రామసభలో నాకు ధ్రువపత్రాలను అందించారు.

–ప్రగడ నాగవంశీ, వెదుళ్లపాలెం

సమన్వయంతో వెనువెంటనే..



ఇప్పటి వరకు జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నక్కపల్లి మండలానికి రెండో స్థానం రావడం ఆనందంగా ఉంది. ఇంటింట సర్వేలో తీసుకున్న దరఖాస్తులకు వెంటనే టోకెన్ జారీ చేసి వాటికి అవసరమైన ధ్రువపత్రాలు సిద్ధం చేసి గ్రామసభలో పంపిణీ చేస్తున్నాం. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పూర్తి స్థాయిలో పనిచేయడం వల్లే ధ్రువపత్రాల జారీలో జాప్యం లేకుండా పంపిణీ చేయగలుతున్నాం.

–డీ.సీతారామరాజు, ఎంపీడీవో, నక్కపల్లి

క్లుప్తంగా

రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాయుడుకు సన్మానం

అనకాపల్లిటౌన్: ఏపీ చౌకధరల డిపో డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన స్థానిక గవరపాలెంకు చెందిన పెంటకోట నాయుడును జిల్లా కమిటీ సభ్యులు బుధవారం సంఘం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చే స్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌కు ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

అనకాపల్లిటౌన్: స్థానిక లక్ష్మీదేవిపేటకు చెందిన యువకుడు బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్ఐ సత్యనారాయణ అందించిన వివరాలిలా ఉన్నాయి. కాండ్రేగుల జితేంద్ర అజయ్(22) ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ చెప్పారు. తల్లి నూకరత్నంతో పాటు తమ్ముడు, చెల్లితో కలిసి సమోసాల కంపెనీలో పనిచేస్తూ, రైల్వేస్టేషన్‌ల్లో వాటిని విక్రయిస్తూ అజయ్ జీవనం సాగుస్తుంటాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో అజయ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై తల్లి నూకరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు.

22 కిలోల గంజాయితో ఒకరి అరెస్టు



గంజాయి కేసు వివరాలను తెలుపుతున్న సీఐ తాతారావు, ఎస్ఐ రామకృష్ణ

కె.కోటపాడు: మండలంలో ఆనందపురం జంక్షన్ వద్ద 22 కిలోల గంజాయితో తమిళనాడుకు చెందిన రాజేష్ కన్నన్ సౌందర్య పాండీ ఎ.కోడూరు పోలీసులకు బుధవారం పట్టుబడ్డాడు. కె.కోటపాడు సర్కిల్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో సీఐ తాతారావు, ఎస్ఐ రామకృష్ణ వివరాలు తెలిపారు. ఎస్ఐ రామకృష్ణ వాహన తనిఖీల్లో భాగంగా చేతిలో బ్యాగ్‌తో అనుమానాస్పదంగా సంచరిస్తున్న రాజేష్ కన్నన్ సౌందర్య పాండీని తనిఖీ చేయగా అతని బ్యాగ్‌లో గంజాయిని గుర్తించామని, దీంతో ఆ వ్యక్తిపై కేసును నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామని తెలిపారు.

‘బీజామృతం’తో విత్తనశుద్ధి

- సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి
- రైతులకు అవగాహనకల్పిస్తున్న అధికారులు
- ప్రకృతి సేద్యంపై అన్నదాత ఆసక్తి



నాతవరం మండలం ఎస్.బి పట్నంలో బీజామృతం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సాక్షి, అనకాపల్లి: రసాయనాలు విరివిగా వాడడంతో భూసారం క్షీణించి, పంటల దిగుబడి తగ్గిపోయి రైతు నష్టాల బాట పట్టి దిగాలు చెందుతున్నాడు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తరుణంలో చీడ పీడల నుంచి పంటను కాపాడుకునే విధంగా ప్రకృతి వ్యవసాయ అధికారులు, సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం, విత్తనశుద్ధి, దేశవాళీ విత్తనాల వినియోగం వల్ల కలిగే లాభాలతో పాటు రసాయన ఎరువులు, పురుగు మందుల వల్ల కలిగే అనర్థాలపై అధికారులు సూచనలు చేస్తున్నారు.

బీజామృతం తయారీ ఇలా

బీజామృతం తయారీలో 20 లీటర్ల నీరు, 5 లీటర్ల ఆవు మూత్రం, 5 కిలోల ఆవుపేడ, 50 గ్రాముల పాడి సున్నం, పొలం గట్టు మీద మట్టి లేదా దొాసెడు పుట్టమన్ను ఉపయోగించాలి. మొదటిగా తొట్టిలో 20 లీటర్ల నీరు పోసి.. ఆవు పేడను పల్చటి గుడ్డలో మూట కట్టి 12 గంటల సేపు నీటిలో ఉంచాలి. ఒక లీటరు నీటిని వేరే పాత్రలో తీసుకొని అందులో 50 గ్రాముల సున్నం కలిపి ఒక రాత్రంతా ఉంచాలి. రెండో రోజు ఉదయాన్నే నానబెట్టిన పేడ మూటను చేత్తో పిండి.. సారాన్ని నీటి తొట్టిలో కలపాలి. పేడ నీళ్లున్న తొట్టిలో పొలంగట్టు మట్టిని పోసి కర్రతో కలియతిప్పాలి. ఇలా 5 లీటర్ల ఆవు మూత్రాన్ని, సున్నపు నీటిని పేడ నీరున్న తొట్టిలో పోసి.. కలిసే వరకు తిప్పితే.. బీజామృతం సిద్ధమైనట్టే. విత్తనాలను ప్లాస్టిక్ కాగితంపై పోసి తగినంత బీజామృతం పోసి కలపాలి. విత్తనాలకు బీజామృతం బాగా పట్టిన తర్వాత విత్తనాలను కొద్దిసేపు నీడన ఆరబెట్టుకొని విత్తుకోవచ్చు. నారును, మొక్కలను కూడా బీజామృతంలో ముంచి నాటుకోవచ్చు.

ప్రీ మాన్‌సూన్ డ్రై షోయింగ్ సాగు

తొలకరి చినుకులు పడిన తరువాత పీఎండీఎస్(ప్రీ మాన్‌సూన్ డ్రై షోయింగ్)లో నవధాన్యాల సాగు చేస్తే భూమి సారవంతంగా తయారవుతుంది. ఇందులో 25 నుంచి 30 రకాల విత్తనాలు వేయాలి. పచ్చిరొట్ట, ధాన్యపుజాతి, పప్పుజాతి, నూనెజాతి, సుగంధ ద్రవ్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, తీగజాతి ఇలా 30 రకాల విత్తనాలు వేయడం ద్వారా భూమి సారవంతంగా తయారవుతుంది. ఈ పీఎండీఎస్ అవశేషాలను భూమిలో కలియదున్నడం కారణంగా.. రసాయన ఎరువులైన డీఏపీలో ఉన్నటువంటి అన్ని రకాల పోషకాలు అందుతాయి. దీని ద్వారా వానపాముల అభివృద్ధి చెంది భూమి గుల్లబారుతుంది. ప్రకృతి వ్యవసాయంతో పండించే ధాన్యంతో భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉంటాయి.

నెల రోజులుగా అవగాహన

జిల్లాలో గత నెల రోజులుగా ప్రకృతి వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. నాతవరం మండలంలో చిన గొలగొండపేట, పెద గొలుగొండపేట, ఎస్.బి. పట్నం, పి.కొత్తగూడెం, సరుగుడు,సుందరకోట, కె.వి. శరభవరం గ్రామాల్లో ఏపీసీఎన్‌ఎఫ్ ప్రాజెక్టు అడ్వైజర్ విజయకుమార్, పాయకరావుపేట డివిజన్ ఎంటీ కె.గోవిందు, డివిజన్ ఎన్‌ఎఫ్‌ఏ పి.అప్పలనాయుడు, మండల ప్రకృతి సిబ్బంది సీహెచ్ సత్యవతి, పీఆర్‌పీ వై.భవాని బీజామృతం తయారీ, పీఎండీఎస్ నవధాన్యాల సాగు గురించి వివరిస్తున్నారు. జిల్లాలో నర్సీపట్నం, మాకవరపుపాలెం, రోలుగుంట, చీడికాడ, రావికమతం, అనకాపల్లి, కశింకోట మండలాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో ప్రకృతి సాగు వివరాలు

2022-23లో ప్రకృతి సాగు		
చేసిన రైతుల సంఖ్య	:	30,374
సాగు చేసిన ఎకరాలు	:	23,590
ఈ ఏడాది లక్ష్యం	:	34,449
సాగు చేయనున్న రైతులు	:	45,708

ప్రకృతి సేద్యంపై రైతుల ఆసక్తి



ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. రైతు తనకున్న మొత్తం భూమిలో ఒకటి రెండు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించేందుకు ఇష్టపడుతున్నాడు. ఇప్పటివరకూ పండించిన వారందరూ కొనసాగించడంతో పాటు ఈ ఏడాది ఎక్కువగా సాగు చేసేందుకు సిద్ధపడుతున్నారు. ప్రకృతి సాగులో మొదటి రెండు సంవత్సరాలు కాసింత దిగుబడి తక్కువగానే ఉంటుంది. ఎరువులతో పండించే విధంగా ప్రారంభంలోనే దిగుబడి రాదు. క్రమేపీ మూడు నాలుగు పంటలు సేంద్రియ పద్ధతిలో పండిస్తే.. తర్వాత నుంచి దిగుబడి క్రమేపీ పెరుగుతూ వస్తోంది.

–చిటికెల ఆర్.వి సత్యవతి, గొలగొండ పేట గ్రామ ఐసీఆర్‌పీ

అదనంగా సాగు



ఈ ఏడాది ప్రకృతి సాగు పెరుగుతోంది. గత ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా 23,590 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో సాగు చేశారు. ఈ ఏడాది 34,449 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయాలన్నది లక్ష్యం. రైతుకు అన్నివిధాల ప్రభుత్వం అండగా నిలుస్తోంది. నియమ నిబద్ధతలతో రైతు వ్యవసాయం చేస్తే సేంద్రియలో అధిక దిగుబడి వస్తోంది.

–లచ్చన్న, జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి

జెట్టీ నిర్మాణానికి దేవుడి మాన్యం భూములిస్తాం

డిప్యూటీ కలెక్టర్‌ను కలిసి అంగీకారం తెలిపిన మత్స్యకారులు



జెట్టీ కోసం స్థల పరిశీలనకు వచ్చిన డిప్యూటీ కలెక్టర్‌ను కలసిన మత్స్యకారులు

నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేటలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్(మినీ జెట్టీ) నిర్మాణానికి గ్రామానికి చెందిన దేవుడి మాన్యం భూములు ఇస్తామని, తక్షణమే జెట్టీ నిర్మాణపు పనులు ప్రారంభించాలని గ్రామస్తులు, మత్స్యకారులు డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణికి తెలిపారు. బుధవారం మరోసారి స్థల పరిశీలనకు వచ్చిన డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి, ఫిషరీస్ ఏడీ ప్రసాద్, మెరైన్ డీఈ వెంకటరావు, ఏఈ గోపినాథ్‌లను గ్రామానికి చెందిన మత్స్యకార నాయకులు ఎరిపల్లి నాగేశు, పిక్కి గంగరాజు, పిక్కి సత్తియ్య, పిక్కి కొండలరావు, కారే వెంకటేష్, బొంది నూకరాజు, పిక్కి రమణ తదితరులు కలిశారు. ఎంతో కాలంగా మత్స్యకారులు కోరుతున్న మినీ జెట్టీని సీఎం జగన్ ప్రభుత్వం ఏడాది క్రితమే మంజూరు చేసింది. ఈ జెట్టీ నిర్మాణానికి రూ.42 కోట్ల నిధులు కూడా విడుదల చేసింది. అ యితే జెట్టీ నిర్మాణానికి 10 ఎకరాల స్థలం అవసరమవుతోంది. ఇప్పటికే పలు పర్యాయాలు కలెక్టర్, జేసీ, మత్స్యశాఖ ఉన్నతాధికారులు రాజయ్యపేట, దొండవాక సముద్ర తీరప్రాంతాల్లో ఉన్న భూములను పరిశీలించారు. జెట్టీ నిర్మాణానికి అనుకూలంగా ఉన్న భూములు అటవీశాఖ పరిధిలో ఉండటంతో, వాటిని సేకరించి ప్రత్యామ్నాయంగా వేరొక చోట భూములు కేటాయించాలని అధికారులు నిర్ధారణకు వచ్చారు. ప్రత్యామ్నాయ భూములు అందుబాటులో లేకపోవడంతో జెట్టీ నిర్మాణపు పనులకు జాప్యం నెలకొంది. దీంతో రాజయ్యపేట గ్రామస్తులు ఎలాగైనా తమ తీరప్రాంతంలో మినీ జెట్టీ నిర్మాణానికి సహకరించాలని ముందుకొచ్చారు. గ్రామంలో సర్వే నెం.288లో దేవుడి మాన్యం(రామాలయానికి చెందిన) సుమారు 19 ఎకరాలు ఉందన్నారు. ఒక దాత రామాలయానికి ఈ భూమిని విరాళంగా ఇచ్చారని, ఈ భూమి గ్రామస్తుల ఆధీనంలో ఉందన్నారు. ఈ భూమిలో కొంత భాగాన్ని మినీ జెట్టీ నిర్మాణానికి తీసుకోవాలని కోరారు. ఈ భూమిని ఇవ్వడానికి గ్రామస్తులకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. ఈ ప్రాంతంలో జెట్టీ నిర్మిస్తే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తక్షణమే ఈ భూమిని సేకరించి జెట్టీ నిర్మాణపు పనులను ప్రారంభించాలని కోరారు. ఇదే విషయమై కలెక్టర్‌ను, ఎమ్మెల్యే గొల్ల బాబూరావును కలిసి తమ అంగీకారం తెలిపినట్టు వెల్లడించారు.

మూడడుగుల స్థలం కోసమే తగాదా

- ఇద్దరు పాత స్నేహితుల నడుమ ఖండివరం భూవివాదం
- దీనిని రాజకీయం చేస్తూ జనసేన నాయకుడు ట్వీట్
- వైఎస్సార్‌సీపీకి ముడిపెట్టే యత్నం
- ఆరోపణలు అవాస్తవమని తేలిన వైనం

సాక్షి, అనకాపల్లి: మాడుగుల నియోజకవర్గం చీడికాడ మండలం ఖండివరం గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన మూడు అడుగుల భూవివాదాన్ని వైఎస్సార్‌సీపీపై నెడుతూ బుధవారం ఒక జనసేన నాయకుడు చేసిన ట్వీట్ అవాస్తవమని తేలింది. ఒక గ్రామానికి చెందిన ఇద్దరు పాత స్నేహితుల మధ్య జరిగిన వివాదాన్ని ఒక జనసేన నాయకుడు తమ పార్టీ సానుభూతిపరుడిపై వైఎస్సార్‌సీపీ దాడిగా చిత్రీకరించి ట్విట్టర్‌లో బుధవారం ట్వీట్ చేసినట్టు తేటతెల్లమైంది. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు స్నేహితుల్లో ఒకరు ఇంటి నిర్మాణం చేపడుతుండగా..మరొకరు అడ్డుకున్న తరుణంలో ఈ వివాదం తలెత్తింది. దీనిపై ఇరువర్గాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. దీనిపై ఎస్ఐ రామారావుని సాక్షి సంప్రదించగా కేసు వివరాలు వెల్లడించారు. చీడికాడ మండలం ఖండివరం గ్రామంలో డోకల గంగాధర్, బొయ్యదాపు వెంకటరమణ కలిసి ఇళ్ల నిర్మాణానికి గ్రామ కంఠం స్థలం కొనుగోలు చేసుకున్నారు. ఇందులో బొయ్యదాపు వెంకటరమణ ఇటీవల ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. వీరిద్దరికీ మూడు అడుగుల స్థలం ఉమ్మడిగా ఉంది. ఈ స్థలంలో సహచరుడు డోకల గంగాధర్‌ని సంప్రదించకుండా బొయ్యదాపు వెంకటరమణ నిర్మాణం చేపట్టడంతో ఇద్దరి మధ్య గత నెలలో వివాదం జరిగింది. పంచాయతీ పెద్దల సమక్షంలో వివాదం పరిష్కారం కాకపోవడంతో ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. సివిల్ సమస్య కావడంతో ఎస్ఐ రామారావు స్థానిక తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఇరువర్గాల వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసి తగాదా పడొద్దని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణం ఆగిపోయిందని వెంకటరమణ కుమారుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ వివాదం కోర్టులో ఉండగానే మరోసారి ఈనెల 11వ తేదీన బుధవారం ఉదయం ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈసారి పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కేసు విచారణ చేస్తున్నారు.

అనుభవం లేకే పవన్ విమర్శలు



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గ్రామ వలంటీర్లను విమర్శించడం తగదని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. బుధవారం ఇక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ.. వలంటీర్ వ్యవస్థ వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంటే, వారి మనోభావాలు దెబ్బతీసే విధంగా పవన్ కల్యాణ్ విమర్శించడం తగదన్నారు. పాలన వ్యవస్థలపైన అనుభవం లేక ఇటువంటి విమర్శలు చేస్తున్నారన్నారు. పవన్ కల్యాణ్ సలహాదారులను అడిగి విషయాలు తెలుసుకోవాలన్నారు. రాష్ట్రంలో గ్రామ వలంటీర్ వ్యవస్థపై ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ప్రశంసలు కురిపిస్తున్నారని చెప్పారు. రాజకీయ నాయకులు విమర్శలు చేస్తే అవి అర్థవంతంగా ఉండాలి తప్ప, నోటికి ఏదొస్తే అది మాట్లాడడం తగదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడం పవన్ కల్యాణ్ తరం కాదన్నారు.

రెండు కార్లు ఢీకొని ఐదుగురికి గాయాలు



చాపరాయి మలుపు వద్ద ఢీకొన్న కార్లు

అనంతగిరి: అనంతగిరి చాపరాయి సమీపంలోని మలుపు వద్ద బుధవారం రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు అందించిన వివరాలివి. అరకు అందాలు తిలకించడానికి వెళ్తున్న పర్యాటకులు దారిలో ప్రమాదానికి గురయ్యారు. చాపరాయి సమీపంలోని మలుపు వద్ద ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనడంతో కర్నూల్‌కు చెందిన కె.అఖిలాస్(26), టి.దినేష్(24), పి.రమణ(25) తీవ్రంగా గాయపడ్డారు. ఎం.సతీష్(40), సుందర్ (32) స్వల్పగాయాలతో బయటపడ్డారు. వారిని అనంతగిరి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యసేవల కోసం ఎస్‌కోట సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగవు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: అకింత భావంతో ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు అన్నారు. మండలంలోని వాడ్రాపల్లిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. వలంటీర్ల మనోభావాలను దెబ్బతీసేలా పవన్‌కల్యాణ్ ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. ఎటువంటి అవినీతికి తావులేకుండా అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు మాటలు విని పవన్‌కల్యాణ్ వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. దీనికి తోడు వలంటీర్ వ్యవస్థపై కోర్టుకు వెళతానంటూ పవన్‌కల్యాణ్ చెప్పడం అవివేకమన్నారు.గత ఎన్నికల్లో రెండు చోట్ల ఓడిపోయినా పవన్‌లో మార్పు రాకపోవడం విచారకరమని తెలిపారు. ప్రజలంతా తెలివిగా వ్యవహరించి జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలన్నారు. చంద్రబాబు,పవన్‌ల మాయమాటలు నమ్మరాదని హితవుపలికారు. వలంటీర్లకు రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు అండగా ఉంటారని తెలిపారు.

వైద్యం కోసం వెళ్లి ప్రమాదం బారిన...

ఏడుగురికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడినవారు

నక్కపల్లి: జాతీయ రహదారిపై దేవవరం సమీపంలో ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టిన ఘటనలో ఏడుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే విశాఖ జిల్లా ఆనందపురం మండలం వేములవలస గ్రామానికి చెందిన పట్నాల ప్రసాద్ తన తండ్రి నరిసింగరావు, తల్లి విజయలక్ష్మి అనారోగ్యంగా ఉండడంతో భద్రాచలంలో ఆయుర్వేద వైద్యుడికి చూపించేందుకు సోమవారం తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దేవవరం దగ్గర బుధవారం వేకువ జామున జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రసాద్ తల్లిదండ్రులతోపాటు భార్య రమాదేవి, పిల్లలు సాయి భార్గవి, నిఖిల్, డ్రైవర్ దినేష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. ముఖాలకు కాళ్లు చేతులకు తీవ్రగాయాలై రక్తస్రావం కావడంతో వెంటనే చుట్టుపక్కల వారు 108 వాహనంలో వారిని తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శిరీష తెలిపారు.

రైతుల అభీష్టం మేరకే తాండవ నీరు విడుదల

ప్రాజెక్టు డీఈ స్వామినాయుడు



మాట్లాడుతున్న ప్రాజెక్టు డీఈ స్వామినాయుడు

నాతవరం: ఆయకట్టు రైతుల అభీష్టం మేరకే తాండవ రిజర్వాయరు నీటిని విడుదల చేస్తామని ప్రాజెక్టు డీఈ జె.స్వామినాయుడు తెలిపారు. తాండవ రిజర్వాయరు నీటి నిల్వలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఖరీఫ్ సీజన్‌లో తాండవ నీరు విడుదలపై నాతవరం ఇరిగేషన్ కార్యాలయం వద్ద రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండవ ప్రాజెక్టులో బుధవారం సాయంత్రానికి 369.4 అడుగుల నీటి మట్టం ఉందన్నారు. ఈనీటిని రెండు ప్రధాన కాలువల ద్వారా ఆయకట్టుకు రోజుకు 400 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తే 58రోజుల వరకు ప్రవహిస్తుందని చెప్పారు. దీనిని బట్టి నీటిని ఎప్పుడు విడుదల చేయాల్లో మీరే నిర్ణయించాలన్నారు. ఈ ఏడాది కాలువలో పూడిక తీత పనులు చేయకపోవడం వల్ల శివారు ఆయకట్టుకు నీరు ప్రవహించదని ఆందోళనగా ఉందని కోటనందూరు, కోటవురట్ల మండలాలకు చెందిన రైతులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి పూడిక తీయించాలని లేకుంటే ఇబ్బందులు వస్తాయన్నారు. తాండవ ప్రధాన గేట్లు లీకేజీని అరికట్టడంతో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు చెప్పారు. కళ్లముందే నీరు వృథాగా పోతున్నా కనీసం పట్టించుకోలేదని తెలిపారు. అనంతరం డీఈ స్వామినాయుడు మాట్లాడుతూ ఆయకట్టుదారులు, ప్రజాప్రతినిధులు సూచనలు మేరకు ఆగస్టు 5వ తేదీ నుంచి 10వ తేదీ లోపు నీటిని విడుదల చేస్తే బాగుంటుందని నిర్ణయించినట్టు తెలిపారు. సమావేశంలో చర్చించిన విషయాలు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ దృష్టికి తీసుకెళ్లి తాండవ నీటి విడుదలపై తేదీని ఖరారు చేస్తామన్నారు. నీటి విడుదల చేసే లోపు ప్రధాన కాలువలో పూడిక తీత పనులు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ పైల సునీల్, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు పైల పోతురాజు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, వ్యవసాయాధికారి శైలజ, తాండవ ప్రాజెక్టు జేఈలు శ్యామ్ కుమార్ వినయ్‌కుమార్, రామకృష్ణ నాగబాబు, నాతవరం, కోటవురట్ల,నర్సీపట్నం కోటనందూరు, తుని, రవతలపూడి మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నర్సీపట్నం: గుర్తు తెలియని ఓ వ్యక్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని టౌన్ సీఐ ఎస్.గణేష్ తెలిపారు. అనారోగ్యంతో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న వ్యక్తిని 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అతను మృతిచెందాడని అన్నారు. మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్టు తెలిపారు.

పులి జాడలతో అప్రమత్తం



పొలాల్లో పులి అడుగు జాడలు

చీడికాడ: మండలంలోని పలు గ్రామాల్లో బెంగాల్ టైగర్ జాడలు కనిపించడంతో కొండప్రాంతం, అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ చీడికాడ ఎస్సై రామారావు హెచ్చరించారు. ఆయన బుధవారం సాక్షితో మాట్లాడుతూ తురువోలు, అర్జునగిరి, చీడికాడ, చీడిపల్లి, కోనాం, మంచాల పంచాయతీల్లోని పలు గ్రామాలు కొండలను అనుకుని ఉన్నాయన్నారు. రెండు రోజులుగా బెంగాల్ టైగర్ ఈ గ్రామాల పరిధిలో సంచరించినట్లు అటవీ శాఖ అధికారులు నిర్ధారించారన్నారు. దీంతో రాత్రి సమయాల్లో ప్రజలు బయటకు రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

లక్కబొమ్మల తయారీకి మరింత తోడ్పాటు

- డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి
- ఏటికొప్పాక హస్త కళాకారులతో ప్రత్యేక సమావేశం



లక్కబొమ్మల తయారీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

యలమంచిలి: ఏటికొప్పాకలో హస్త కళలను మరింత అభివృద్ధి చేయాలని డీఆర్‌డీఏ పీడీ(వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్ట్ డైరెక్టర్) లక్ష్మీపతి అన్నారు. బుధవారం ఆయన ఏటకొప్పాక గ్రామంలో లక్క బొమ్మల సొసైటీ కేంద్రాన్ని సందర్శించారు. స్థానిక కళాకారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మాట్లాడుతూ లక్కబొమ్మల తయరీలో ఎక్కువ మంది కళాకారులు తర్ఫీదు పొందాలని, లక్కబొమ్మలకు అంతర్జాతీయంగా మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని తెలిపారు. బొమ్మల తయారీకి కావలసిన ముడి సరకును ప్రభుత్వం నుంచి అందించేలా ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. ఇటీవలే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్ అనే సర్వేలో భాగంగా కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల్లో ఒక్కో జిల్లా నుంచి కళలను ప్రోత్సాహించే ఉద్దేశ్యంతో త్వరలో ఎంపికలు నిర్వహించిఅవార్డులు ఇవ్వనుందని అన్నారు. ఇక్కడ లక్కబొమ్మలను తయారు చేసే కళాకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తుందని మరింత మంది కళాకారులు ఈ వృత్తిలో భాగం కావాలని అన్నారు. స్థానిక ఆర్టిజన్స్ తయారు చేసిన లక్కబొమ్మలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా లక్కబొమ్మల కళాకారుడు శ్రీశైలపు చిన్నయాచారి మాట్లాడుతూ బొమ్మల తయారీకి వినియోగించే అంకుడు కర్ర దొరకడం లేదని, అలాగే రంగుల తయారీలో వాడే ముడి సరుకుల ధరలు పెరిగిపోయాయని ప్రభుత్వం స్పందించి అందరికీ అందుబాటులో అంకుడు కర్ర దొరికేలా చూడాలని, కళాకారులకు రంగులు అద్దే మిషనరీని అందజేయాలని కోరారు. కార్యక్రమంలో లక్కబొమ్మల సొసైటీ అధ్యక్షుడు దిమిలి రమణబాబు, డీపీఎం సంజయ్‌బాబు. కోఆర్డినేటర్ సత్యనారాయణ, వీవోఏ తల్లిబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దిబ్బవీధిలో 'జగనన్న సురక్ష' నేడు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధి సచివాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జీవీఎంసీ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.కె.దొర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. సచివాలయంలో పరిధిలో దరఖాస్తుదారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాల్సిందిగా కోరారు.

సంతోషిమాత ఆలయంలో 18న బహిరంగ వేలం

అనకాపల్లిటౌన్:గవరపాలెం సంతోషిమాత అమ్మవారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన చీరలు, రవికెలు, కొబ్బరి ముక్కల సేకరణ హక్కులకు ఈ నెల 18న టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.ఆదినారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో దక్కించుకున్నవారికి చీరలు, రవికెల హక్కులు ఆగస్టు 1 నుంచి వచ్చే ఏడాది జూలై 31 వరకూ, కొబ్బరి ముక్కలకు ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 15 వరకు సేకరించుకునే అధికారం ఉంటుందన్నారు. ఆలయ ఆవరణలో జరిగే వేలంలో పాల్గొనే ఆసక్తి ఉన్నవారు ఒక్కోదానికి రూ.5 వేలు చొప్పున ప్రథమ ధరావతు చెల్లించాలన్నారు. పాట ముగిసిన వెంటనే హెచ్చుపాటదారు పాట మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు.

16న సీహెచ్ఎన్ అగ్రహారంలో 'గడప గడపకు'

అనకాపల్లిటౌన్: మండలంలోని సీహెచ్ఎన్ అగ్రహారంలో ఈ నెల 16న ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రభుత్వ విభాగాల అధికారులు, సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

14 నుంచి మృత్యుంజయ హోమం

అనకాపల్లిటౌన్: మండలంలోని భట్లపూడి గ్రామం ఆంజనేయస్వామి ఆలయం వెనుక సోహం ఆశ్రమం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి మహా మృత్యుంజయ హోమం నిర్వహించనున్నట్లు ఆశ్రమం నిర్వాహకులు కాండ్రేగుల రవి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 10 వరకు జరుగుతుందన్నారు. భక్తులందరూ తమ గోత్ర నామాలను ఆశ్రమ నిర్వాహకులకు అందించి, హోమంలో భాగస్వాములు కావాల్సిందిగా కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 136 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	4,100	4,100
మూడోరకం	---	---

అనకాపల్లి సినిమాలు

రుద్రంగి	: రాజా
ఆదిపురుష్	: సత్యనారాయణ స్క్రీన్-1
మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)	: సత్యనారాయణ స్క్రీన్-2
మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)	: షిర్డిసాయి
అశ్విన్స్	: పర్తిసాయి
ఇన్సిడియస్ ద రెడ్ డోర్	: వెంకటేశ్వర
భాగ్ సాలే	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 20 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ నెగిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-5 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి గంగయ్య(9182834480)ని సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 329 మంది వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 306 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ప్రకృతి వ్యవసాయం.. ప్రజలకు ఆరోగ్యం

- ప్రకృతి సాగుపై రైతుల్లో పెరుగుతున్న ఆసక్తి
- ప్రభుత్వ ప్రోత్సాహం, ఆరోగ్యకర ఉత్పత్తులే కారణం

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం, ఆరోగ్యకరమైన ఉత్పత్తులకు రాజమార్గం కావడంతో ఏటా ప్రకృతి సాగు పెరుగుతోంది. కశింకోట మండలంలో సుమారు 1800 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం జరుగుతోంది. భూసారం పెంపులో భాగంగా ఇప్పటికే సగంభూముల్లో పీఎండీఎస్ విత్తనాలు వేశారు. వీటితో అదనపు ఆదాయం కూడా పొందుతున్నారు.

కశింకోట : మండలంలో ప్రకృతి వ్యవసాయం సాగు మొదలైంది. ఇప్పటికే సాధారణ సాగు విస్తీర్ణంలో దాదాపు సగమైన 943 ఎకరాల్లో ప్రకృతి సిద్ధంగా భూసారం, చీడ పీడలు, తెగుళ్ల నివారణ కోసం తొలకరి ముందు నాటే 30 రకాల విత్తనాల సాగు చేపట్టారు. అవి ప్రస్తుతం ఎదుగుదల దశలో ఉన్నాయి. మిగిలిన 847 ఎకరాల భూముల్లో వర్షం పడితే సాగు చేపట్టేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

10 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం

రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఆరోగ్యకరమైన ఉత్పత్తులను ప్రజలకు అందించే ఉద్దేశంతో ప్రకృతి సాగును ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మండలంలో సాగు కోసం పది గ్రామాల్లో రైతులను సిద్ధం చేశారు. తాళ్లపాలెం, అచ్చెర్ల, సింగవరం, మోసయ్యపేట, జి.భీమవరం, సుందరయ్యపేట, ఆనందపురం, చెరకాం, బంగారయ్యపేట, అడ్డాం గ్రామాల్లో 2018 నుంచి ప్రకృతి వ్యవసాయాన్ని ఏటా నిర్వహిస్తున్నారు.

1802 పీఎండీఎస్ కిట్ల పంపిణీ

ప్రకృతి వ్యవసాయంలో రైతులు భూసార పరిరక్షణకు సూక్ష్మ పోషకాలను భూమిలో వృద్ధి చేసేందుకు తొలకరి వర్షాలకు ముందు నాటే విత్తనాలు(పీఎండీఎస్) 30 రకాలను పంపిణీ చేశారు. మండలంలోని ప్రకృతి సిబ్బంది సాయంతో పీఎండీఎస్ విత్తనాలను పెద్ద మొత్తంలో సేకరించి, వాటిని మోతాదు మేరకు కలిపి ఎకరం భూమికి 12 కిలోల వంతున కిట్లుగా సిద్ధం చేశారు. 1802 కిట్లను ఒక్కొక్కటి రూ.వెయ్యికు అందించారు. గత నెలలో గ్రామాల్లో అడపాదడపా వర్షాలు కురవడంతో భూములను దున్ని విత్తనాలు వేశారు. పంట భూములతోపాటు జీడిమామిడి, బొప్పాయి, కొబ్బరి తదితర తోటల్లో కూడా వీటి సాగు చేపట్టారు. దీంతో అవి ఎదుగుదల దశలో ఉన్నాయి.



విత్తన శుద్ధి చేస్తున్న రైతు కుటుంబం



జి.భీమవరంలో ఘన జీవామృతం తయారీ



జీడిమామిడి తోటలో ఎదిగిన పీఎండీఎస్ విత్తనాలు

ప్రత్యామ్నాయ ఆదాయం

ఈ విత్తనాల్లో బీర, ఆనప, బరబాటి పాదులు, గోంగూర, తోటకూర, కొత్తిమీర వగైరా ఎదిగి ఆదాయాన్ని కూడా తెచ్చిపెడుతున్నాయి. వీటికి 45 నుంచి 60 రోజులు వయస్సు వచ్చాక భూమిలో కలియదున్నేస్తారు. అవి దుక్కిలో కుళ్లి, సూక్ష్మ పోషకాలుగా వృద్ధి చెంది భూమికి సారాన్ని అందిస్తాయి. దీనివల్ల యూరియా, డీఏపీ వంటి ఎక్కువ ఖరీదు కలిగిన రసాయనిక ఎరువులు వాడనక్కర్లేదు. దీనికి తోడుగా ఘన, ద్రవ జీవామృతం పంటల ఎదుగుదలకు, భూముల సారవంతానికి ఉపయోగపడతాయి. వీటి తయారీపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు ప్రజలకు అందుతాయి.

ఆరేళ్లుగా కూరగాయల సాగు



ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరేళ్లుగా ఎకరం భూమిలో బీర, ఆనప, బెండ, బరబాటి, వంగ, ఆకుకూరలు పండించి ప్రజలకు అందిస్తున్నాం. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా భూమి సారవంతం కావడానికి పీడీఎంఎస్ విత్తనాల సాగు చేపట్టాం. బీర, ఆనప కాయలు కాస్తున్నాయి. గోంగూర, తోటకూర కూడా ఎదిగి విక్రయానికి సిద్ధమైంది. వీటి ద్వారా అదనపు ఆదాయం లభిస్తోంది.

–ద్వారపురెడ్డి రమణ, రైతు, జి.భీమవరం.

ఏడాది నుంచి ప్రకృతి సాగు



ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖరీఫ్ వరి సాగు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాను. గత ఏడాది నుంచి ప్రకృతి వ్యవసాయం చేపట్టాం. దీనికి ముందు భూములను ప్రకృతి సిద్ధంగా సారవంతం చేసేందుకు పీఎండీఎస్ విత్తనాలను వేశాం. అవి ఎదుగుదల దశలో ఉన్నాయి. వీటిని బాగా ఎదిగాక భూసారం పెరిగేందుకు భూమిలో కలియదున్నేస్తాం. తర్వాత ఖరీఫ్ వరి సాగు చేస్తాం.

– కె.నాగేశ్వరరావు, రైతు, తాళ్లపాలెం

మరో 843 ఎకరాలు సాగుకు సిద్ధం

మండలంలోని ప్రకృతి వ్యవసాయం సాగు చేసే గ్రామాల్లో 1802 మందికి తొలకరి వర్షాల ముందు పీడీఎంఎస్ విత్తనాల కిట్లను అందించాం. ఇప్పటికే 943 ఎకరాల్లో వీటిని నాటారు. మరో 843 ఎకరాల్లో నాటేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. 45 రోజుల ఎదుగుదల తర్వాత వీటిని భూమిలో కలియదున్నితే చాలు. ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయం సాగును పెంచే ప్రక్రియలో జీవామృతం తయారీపై రైతులకు గ్రామాల్లో అవగాహన కలిగిస్తున్నాం.

– డి.రమణ, ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి, కశింకోట మండలం

పచ్చి మేతతో అధిక పాల దిగుబడి

కశింకోట:పాడి పశువులకు పచ్చి గడ్డి మేత వేయడం వల్ల అధిక పాల దిగుబడి సాధించవచ్చని నరసింగబిల్లి పశువైద్యాధికారి చైతన్యమణి తెలిపారు. మండలంలోని నరసింగబిల్లిలో జగనన్న పాలవెల్లువ గ్రామాలైన అమీన్‌సాహెబ్‌పేట, నరసాపురంలలో పశు గ్రాస వారోత్సవాల్లో భాగంగా పాడి రైతులతో బుధవారం సమావేశం నిర్వహించి, క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాల ఉత్పత్తికి పచ్చి గడ్డి మేత ఆధారమన్నారు. పాల ఉత్పత్తిని పెంపొందించడానికి నాణ్యమైన పశు గ్రాసాన్ని సాగు చేసుకోవాలని సూచించారు. పాడి రైతులు తప్పనిసరిగా మేలుజాతి పచ్చిగడ్డి, కాయగడ్డితోపాటు, పప్పు జాతి గడ్డిని కూడా పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు గడ్డి విత్తనాలను అందించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ ప్రతినిధి భూపతి తదితరులు పాల్గొన్నారు.



పాడి రైతులకు పశుగ్రాస విత్తనాలను అందిస్తున్న పశు వైద్యాధికారి చైతన్యమణి

ముంచెత్తిన వర్షపు నీరు

కశింకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రోడ్డులో బుధవారం మోకాలు లోతున వర్షపు నీరు నిలిచిపోయింది. మంగళవారం రాత్రి ఇక్కడ కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో పల్లపు ప్రాంతాల్లో భారీగా వర్షపు నీరు చేరింది. ఇక్కడి పీహెచ్‌సీ, మండల పరిషత్ కార్యాలయానికి కూడా వెళ్లే ఈ రోడ్డులో నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు.



పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

ఘనంగా పైడితల్లి అమ్మవారి పండగ

అనకాపల్లిటౌన్: గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన కొండకొప్పాక గ్రామంలో పైడితల్లి అమ్మవారి పండగ బుధవారం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారి ఆలయానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పీలాను సంప్రదాయబద్ధంగా సత్కరించారు.



అమ్మవారి సన్నిధిలో భక్తులు

గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలందించాలి

అనకాపల్లిటౌన్: గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసిందని, అక్కడకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్ సూచించారు. మండలంలోని గోపాలపురం గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను బుధవారం సందర్శించి, రికార్డులను, ప్రభుత్వ యాప్‌ల వినియోగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని, గ్రామాల్లో ఇంటింటికీ వైద్యసేవలు అందించాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో గృహాలకే పరిమితమైన రోగులను ఆశ సిబ్బంది పర్యవేక్షణలో ఉంచాలన్నారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను, ప్రభుత్వ యాప్‌లో అప్‌లోడ్ చేసిన వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో తుమ్మపాల పీహెచ్‌సీ వాణీజగదీశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆన్‌లైన్ యాప్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

రైతులకు రాయితీపై విత్తనాల పంపిణీ

మునగపాక : రైతు పక్షపాతిగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సేవలందిస్తున్నారని అరబుపాలెం ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి పేర్కొన్నారు. అరబుపాలెం ఆర్‌బీకే ద్వారా రైతులకు రాయితీపై బుధవారం విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే వివిధ రకాల వరి విత్తనాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీఏఏ సత్య రవిరాజ్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎంపీటీసీ బుజ్జి

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ

అనకాపల్లిటౌన్: పట్టణంలోని 82వ వార్డు పరిధి పాతబర్మాకాలనీలో కార్పొరేటర్ మందపాటి సునీత చొరవతో శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన స్తంభాలను విద్యుత్‌శాఖ సిబ్బంది బుధవారం ఏర్పాటు చేశారు. ఇటీవల సమస్యను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్‌తోపాటు, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. దీంతో కాలనీవాసులు కార్పొరేటర్‌కు, యువజన విభాగం అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అనకాపల్లిటౌన్: మండలంలో అల్లిఖానుడిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో జగనన్న కాలనీకి విద్యుత్ లైన్లు ఏర్పాటు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కిరాణాషాపులు, దుకాణాల్లో తనిఖీలు



కాటాలను పరిశీలిస్తున్న తూనికల శాఖ అధికారులు

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో షాపులు, దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. బాటజంగాలపాలెం, నారపాడు, అమ్ములపాలెం, నల్లరేగులపాలెం గ్రామాల్లోని కిరాణా షాపులు, చికెన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి 10 కేసులు నమోదు చేశారు. తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో కిరాణా షాపులు, చికెన్ సెంటర్లలో తూనికల్లో అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు.

మహిళల పోరు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ: హింసపై ఐద్వా ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి ఆగస్టు 9 వరకు చేపట్టనున్న మహిళల పోరు యాత్రను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం పిలుపునిచ్చారు. వాడచీపురుపల్లిలో బుధవారం పోరు యాత్ర కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినతరం చేయాలని డిమాండ్ చేశారు. మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మండలానికి ఒక్క మద్యం షాపే ఏర్పాటు చేయాలన్నారు. కళాశాలలు, పని ప్రదేశాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐద్వా సహాయ కార్యదర్శి ఆర్.లక్ష్మి సభ్యులు కె.ఆదిలక్ష్మి, రత్నకుమారి, పార్వతి, సత్యవతి, గండి లక్ష్మి, నూకాలమ్మ పాల్గొన్నారు.

మూడో రోజూ రోడ్డు విస్తరణ పనులు

అనకాపల్లిటౌన్: పెరుగుబజార్–గాంధీబొమ్మ జంక్షన్ రహదారి విస్తరణ పనులు మూడో రోజైన బుధవారం జీవీఎంసీ అధికారులు కొనసాగించారు. ఈ సందర్భంగా జోన్ టీపీవో ఎంపీ జనార్దనరావు మాట్లాడుతూ తొలిరోజు 10 భవనాలను, రెండో రోజు 15 భవనాలను, మూడో రోజు 10 భవనాలను తొలగించినట్లు తెలిపారు. భవన యజమానులు దగ్గరుండి మరీ తమ భవనాల తొలగింపు పనుల్ని పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. మూడో రోజు నుంచి పెరుగుబజార్ జంక్షన్ వద్దనున్న బంగారు దుకాణాలను తొలగిస్తున్నట్లు తెలిపారు. నెల రోజుల్లో పూర్తిగా భవనాలు తొలగించిన తరువాత రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఈ రహదారిలో రాకపోకలు సాగించే ప్రయాణీకులు రహదారి విస్తరణ పనులకు ఆటంకం లేకుండా సహకరించాలని కోరారు.



భవనాలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

పాలిటెక్నిక్ విద్యార్థులకు అభినందన

కశింకోట : స్థానిక ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన సెమిస్టర్ పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ శివ బుధవారం తెలిపారు. మొదటి ఏడాది ఈసీఈ బ్రాంచ్‌లో పి.తులసి 95.8 శాతం మార్కులు, ఈఈఈ బ్రాంచిలో కె.మురళి 90.6 శాతం, మెకానికల్ ఇంజినీరింగ్‌లో జి.యోగినాగేంద్ర 85.8 శాతం, సివిల్ ఇంజినీరింగ్‌లో టి.రోహిత్ 85.1 శాతం మార్కులతో మొదటి స్థానంలో నిలిచారన్నారు. 4 సెమిస్టర్లలో ఈసీఈలో బి.వందన 95.9 శాతం, ఈఈఈలో డి.హేమంత్ 93.9 శాతం, సివిల్‌లో టి.కావ్య 91.8 శాతం, మెకానికల్‌లో ఎస్.మోహన్ 87.6 శాతం మార్కులతో ముందంజలో ఉన్నట్టు పేర్కొన్నారు. 5వ సెమిస్టర్లో ఈసీఈలో ఎం నాగతేజేశ్వరి 95.7 శాతం, ఈఈఈలో ఎం.ఝాన్సీ 93.9 శాతం, మెకానికల్‌లో శ్రీదేవి అర్జున్ 92.7 శాతం, సివిల్‌లో పి.రమ్య నాగేశ్వరి 88.5 శాతంతో ప్రథమ స్థానం పొందారన్నారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు నిర్వహించిన ఈసెట్‌లో మెకానిక్ బ్రాంచ్‌లో ఎస్.హరీష్ 49వ ర్యాంకు, పి.సాయికుమార్ 72వ ర్యాంకు, ఎలక్ట్రానిక్స్‌లో ఎం.శ్రీనివాస్ 137, జి.సందీప్ 141 ర్యాంకు సాధించినట్టు తెలిపారు. వీరిని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు గణేష్, రమణకుమార్, శివరాం, సిబ్బంది పాల్గొన్నారు.



జ్ఞాపికలతో ఉత్తమ మార్కులు పొందిన వివిధ బ్రాంచ్‌ల విద్యార్థులు

పీఏసీఎస్‌లో విశ్రాంతి భవనం ప్రారంభం

అనకాపల్లిటౌన్: మండలంలోని సీహెచ్ఎన్ అగ్రహారం పీఏసీఎస్ కార్యాలయంలో రూ.4 లక్షలతో నిర్మించిన విశ్రాంతి భవనాన్ని సంస్థ చైర్మన్ బంటు ఏడుకొండలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన సమయంలో ఈ విశ్రాంతి గది సిబ్బందికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నారపిన్ని ప్రసాద్, ఓపిరెడ్డి నాగేశ్వరరావు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ ఏడుకొండలు

'జగనన్న సురక్ష'తో 90 రోజుల్లో ఇంటి స్థలం



రేబాకలో మహిళకు ధ్రువపత్రం అందిస్తున్న ఎంపీపీ సూరిబాబు



ఉగ్గినపాలెంలో ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు

అనకాపల్లిటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇల్లు లేని అర్హులు దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో ఇంటి స్థలం మంజూరు చేయనున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. మండలంలోని రేబాక గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, ఈ నెలాఖరులో కావాల్సిన ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో ధ్రువపత్రాల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగిన వారికి, తమ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమం విలువేంటో తెలుస్తోందన్నారు. తమ ఇంటి వద్దే దరఖాస్తు తీసుకుని, వారం రోజుల్లో గ్రామంలోనే ధ్రువపత్రాలను అందించడం సీఎం జగన్ ప్రభుత్వంలో తప్ప మరెక్కడా లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వి.నర్సింహారావు, సర్పంచ్ మార్టూరు సన్యాసమ్మ, ఎంపీటీసీ మంత్రి సంతోషం, పార్టీ నేతలు మంత్రి సత్యనారాయణమూర్తి, వార్డు మెంబర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

1637 మందికి ధ్రువపత్రాల పంపిణీ

కశింకోట: జగనన్న సురక్ష కార్యక్రమంలో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతుండటంతో ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని ఉగ్గినపాలెం, జమాదులపాలెం సచివాలయాల్లో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని 1,637 మందికి కుల, ఆదాయ, ఇతర ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష వంటి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజలకు మరింత అండగా నిలుస్తున్నారన్నారు. అలాంటి ప్రజా సంక్షేమ సారథికి ప్రజలు సంపూర్ణ మద్దతు అందించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, కరక రాజ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, ఉప తహసీల్దార్ సురేష్‌నాయుడు, హౌసింగ్ ఏఈ వి.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి వెలకట్టలేనిది

పరవాడ: విద్యార్థుల మనసు దోచుకునే ఉపాధ్యాయులు ధన్యులని పరవాడ వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు అన్నారు. వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పని చేసి స్వచ్ఛంద విరమణ పొందిన గణిత ఉపాధ్యాయురాలు జి.సుజాత, బదిలీ అయిన పాఠశాల హెచ్‌ఎం కర్రి జగన్‌మోహన్‌నాయుడు, ఉపాధ్యాయులు ఎస్.ఖగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ఎం.పద్మలత, ఆర్.విజయలత, డి.గాయత్రిలను బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. అనంతరం వైస్ ఎంపీపీ, మాజీ ఎంపీపీలు మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి వెలకట్టలేనిదన్నారు. సన్మాన సభలో పాఠశాల హెచ్‌ఎం పందిరి కనకేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ పి.పద్మావతి, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, వైస్ సర్పంచ్ కూండ్రపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న వైస్ ఎంపీపీ అప్పలరాజు తదితరులు